
ప్రజాశక్తి

మంగళవారం 9 సెప్టెంబర్ 2025 5

పార్వతీపురం మన్యం



నేషనల్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురం : డిసెంబర్ 7న జరగబోయే నేషనల్ స్కాలర్ షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) పరీక్షలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ బి.రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎయిడెడ్ పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుని కుటుంబ వార్షికాదాయం రూ.3.5లక్ష లకు మించకూడదని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా www.bse.ap.gov.in ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలకు ఒసి, బిసి విద్యార్థులు రూ:100, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.50ను అక్టోబర్ 10వ తేదీలోగా ఆన్లైన్‌లో చెల్లించాలన్నారు. ఆన్లైన్ లో సమర్పించించిన దరఖాస్తును ధవపత్రాలు, ఫీజ్ రసీదుతో సహా అక్టోబర్ 15లోగా డిఇఒ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.



పాలకొండలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎరువు... కరువు

- ఎన్ని ఎకరాలున్నా ఒక బస్తా యూరియా మాత్రమే
- షాపులు, ఆర్ఎస్‌కెల ముందు రైతుల కుస్తీ
- కొరత లేదంటూ మభ్యపెడుతున్న జిల్లా అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా అంతటా ఎరువుల కొరత వెంటాడుతోంది. అన్నదాతలు యూరియా కోసం నిద్రాహారాలు మాని కాపలా కాపలా కావాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే సగం ముగిసింది. అయినా అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయల మదుపు పెట్టి పండించిన పంటలకు సకాలంలో యూరియా, డిఎపి ఎరువులు దొరకకపోవడంతో వారు అయోమయంలో పడ్డారు. దిక్కు తోచని పరిస్థితిలో రైతులు ఎక్కడ యూరియా దొరుకుతుందా అని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా వుంది. ఖరీఫ్ సీజన్ లో సాగు చేస్తున్న పంటల కు అనుగుణంగా ఎరువులను సిద్ధం చేయడంలో అధికార యంత్రాంగం విఫలమయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు సేవా కేంద్రాల వారీగా డిమాండ్‌ను బట్టి స్థానిక వ్యవసాయ అధికారులు ఎరువులను రప్పించడంలో నిర్లక్ష్యం వహించారా లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన కోటాలో కోత విధించారా అన్నది జిల్లా అధికారులు గోప్యంగా వుంచుతున్నారు. ఎక్కడా రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ఒకేసారి యూరియా, డిఎపి ఎరువులు అవసరం ఉంది. ఈ డిమాండ్‌కు తగినంతగా సరఫరా లేకపోవడంతో రైతులు అక్కడక్కడా ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొరత లేదంటూ అధికారుల కాకి లెక్కలు

జిల్లాలో ఎరువుల కొరత లేదంటూ అధికారులు గత కొద్ది నెలలుగా కాకి లెక్కలు చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో టన్నుల కొలదీ యూరియా అందుబాటులో ఉందని ప్రకటనలిస్తున్నారు. కానీ రైతుల అవసరాలకు సరిపడా వుండడం లేదనే విషయాన్ని అధికారులు బయటకు చెప్పలేకపోతున్నారు. ఉన్నదానినే సర్దుబాటు చేసుకోవాలనే రీతిలో సూచిస్తున్నారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో సహా వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు సైతం ఒకే పాట పాడుతున్నారు. కొరత లేదని చెపుతూ రైతులను మభ్యపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవ పరిస్థితిని దాచిపెట్టి కొరత లేదంటూ ప్రకటనలు చేయడం పై రైతు సంఘాలు భగ్గుమంటున్నాయి.

ప్రణాళికా లోపం వల్లే కొరత

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఎరువుల లభ్యత వుండాలి. కానీ ఆ విధంగా లేకపోవడం వెనుక అసలు కారణాలను అధికారులు పైకి చెప్పలేకపోతున్నారు. డిమాండ్ ఆధారంగా ఎరువుల సరఫరా కాకపోవడం వెనుక దాగివున్న కారణాలు చెప్పకుండా అధికారులు యూరియా ఎక్కువగా వాడొద్దని, నానో యూరియా, నానో డిఎపిలను వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు. అనేక దశాబ్దాలుగా రైతులు యూరియా, డిఎపి ఎరువుల వాడకానికి అలవాటు పడ్డారు. ఉన్నఫలంగా నానో ఎరువుల వాడాలని అధికారులు చెప్పడం వెనుక అసలు కారణం ఎరువుల కొరతేననీ స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి అవసరమైన మేర కేంద్రం నుంచి ఎరువుల సరఫరా జరగకపోవడంతో పాటు స్థానిక అవసరాలకు సరిపడా అధికారులు అంచనా వేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది సరిగ్గా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సిబ్బంది, మండల, సబ్ డివిజన్ స్థాయి అధికారుల బదిలీ ప్రక్రియ నిర్వహించడం వల్ల కూడా ఎరువుల అవసరాలపై సరైన ప్రతిపాదనలు పంపించేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన ఎరువులను ప్రణాళికా బద్ధంగా పంపిణీ చేయలేదు. ఆధార్ కార్డు ఉన్న వారందరికీ ఎరువుల పంపిణీ చేయడంతో ఆ సమయంలో చాలా వరకు ఎరువులు పక్కదారి పట్టాయి. డిమాండ్ పెరిగిన సమయంలో ఆధార్‌తో పాటు భూమి వివరాలు తెలియజేసే వన్ బి పత్రాలను పరిశీలించి ఎరువుల పంపిణీ ప్రారంభించారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు సరైన విధానం అవలంబించలేదనే విమర్శలు వున్నాయి. ఈ సీజన్ లో ఎక్కువ ఎరువుల ను పిఎసిఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. వీటిపై స్థానిక అధికారపార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోవడంతో చాలా చోట్ల ఎరువులు బ్లాక్ మార్కెట్లోకి వెళుతున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం పాచిపెంట మండలం కేసలి పిఎసిఎస్ అధ్యక్షుడే ఎరువుల ను దొడ్డిదారిన తరలిస్తూ దొరికిపోయారు. ఇలాంటి సంఘటనలు కనిపించకుండా అనేక చోట్ల జరుగుతున్నాయి. వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల నిఘా వున్నప్పటికీ ఎరువులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

యూరియా ఇప్పించండి మహా ప్రభో...

పాలకొండ : యూరియా కోసం రైతన్నలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్ని కావు. యూరియా కోసం ప్రైవేట్ దుకాణాల దగ్గర రైతులు క్యూలో గంటల సమయం వేచి చూడాల్సిన పరిస్థితి వస్తుంది. గ్రోమోర్ దుకాణానికి యూరియా రావడంతో ఉదయం నుంచి క్యూలైన్లో రైతులు గంటలపాటు ఎదురుచూడాల్సి పరిస్థితి వచ్చింది. ఒక్క బస్తా దొరికితే చాలన్న పరిస్థితిలో రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. చెక్ పోస్ట్ దగ్గర షాప్ ఉండగా క్యూ లైన్ మాత్రం వీరఘట్టం రోడ్డుకు దాటింది.

ఎన్ని ఎకరాలున్నా ఒకే ఒక్క యూరియా బస్తా

జిల్లాలో ఒకే ఒక్క యూరియా బస్తా కోసం రైతులు అల్లాడిపోతున్న పరిస్థితి. ఎన్ని ఎకరాలున్నా ఒకే యూరియా బస్తా ఇస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ ఒక్క యూరియా బస్తా అయినా దొరుకుతుందో లేదోనన్న ఆందోళనలో అన్నదాతలు ఎండనక, వాననక రైతు సేవా కేంద్రాల ఎదుట పడిగాపులు పడుతున్నారు. సోమవారం సాలూరు మండలంలోని కూర్మరాజుపేట రైతు సేవా కేంద్రానికి 250 బస్తాల యూరియా వచ్చిందని తెలిసి సుమారు 500 మందికి పైగా రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. వ్యవసాయ అధికారులు, పోలీసుల సమక్షంలో 250 మందికి సరఫరా చేయడంతో మిగిలిన రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే పార్వతీపురం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న మన గ్రోమోర్ షాపు వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి ఎదురు చూశారు. పోలీసుల సమక్షంలో వంద బస్తాలు పంపిణీ చేసి చేతులెత్తేయడంతో మిగిలిన రైతులు నిరాశ తో వెనుదిరిగారు. పాలకొండ పట్టణంలో ఉన్న గ్రోమోర్ షాపు వద్ద వందలాది మంది రైతులు యూరియా కోసం గుమిగూడారు. సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని చెపుతున్నారు. ఈ ప్రాంతంలో రైతు సేవా కేంద్రాలకు సరఫరా అవుతున్న ఎరువులు పక్కనున్న ఒడిశాకు తరలిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పోలీసులతో వాగ్వివాదానికి దిగిన రైతులు

యూరియా కోసం రైతుల తోపులాట

వీరఘట్టం : స్థానిక గ్రోమోర్ షాపునకు 300 యూరియా బస్తాలు వచ్చాయని విషయం తెలుసుకున్న అన్నదాతలు నాలుగో సచివాలయంలో యూరియా కోసం ఉదయం ఏడు గంటల నుంచి క్యూ కట్టారు. సమయం మించిన కొద్దీ ఎక్కువ మంది రైతులు యూరియా కోసం రావడంతో తోపులాటజరిగింది. ఈ తోపులాటలో పలువురు రైతులకు గాయాలయ్యాయి. పోలీసులు సద్దుమణిగి చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ తోపులాటలో రైతులు తమ వెంట తీసుకొచ్చిన 1-బి, ఆధార్ జిరాక్స్ కాపీలు చిరిగిపోయాయి. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురవ్వలేదని, యూరియా ఎప్పుడు వస్తాదా అంటూ ఎదురు చూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రోమోర్ గోడౌన్ వద్దకు వెళ్లి అన్నదాతలు అందరికీ రసీదులు ఇస్తేనే యూరియా ఇవ్వాలంటూ నినాదాలు చేయడంతో షట్టర్ మూసి వేశారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అధైర్య పడొద్దు... ఎరువులు ఉన్నాయి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో సాగుకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావున రైతులు అధైర్య పడొద్దని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని సూరంపేటను కలెక్టర్ సోమవారం సందర్శించి, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి రైతుల కష్టసుఖాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని, తొందరపడి అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లాలోని రైతులకు ఎరువులను సరఫరా చేశామని, రైతు సేవా కేంద్రాల్లో మరిన్ని నిల్వలు ఉన్నట్లు వివరించారు. రైతుల అవసరాలకు తగిన విధంగా మరిన్ని కంపెనీల నుంచి ఎరువులను తెప్పిస్తున్నామన్నారు. అవసరం మేరకు వాటిని పొందవచ్చని సూచించారు. ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల స్టాకు వివరాలను ప్రజలకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశామని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు. రైతుల అవసరాలు తెలుసుకొని, ఎప్పటికప్పుడు ఎరువులను జిల్లాకు రప్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రైతులు కూడా ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని అన్నారు. నానో ఎరువుల వినియోగం ద్వారా కూడా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ వివరించారు. అనంతరం సీసీఆర్సీ కార్డులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారంవైద్య - ఆరోగ్యం, యూరియా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పత్రికల్లో జ్వరాలు పరిస్థితులపై కథనాలు వస్తున్నాయని, వీటిపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా మలేరియా అధికారి మలేరియా నివారణ దిశగా అన్ని చర్యలు చేపట్టాలని, సంబంధిత నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల వైద్య ఆరోగ్య పరిస్థితిలను తనిఖీ చేసి ఎటువంటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాల వద్ద పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, పూర్తిస్థాయి ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థికి జ్వరం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్ల వద్ద తుప్పలను తొలగించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, టి.కనకదుర్గ, డిపిఒ టి.కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయక్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె శ్రీనివాసు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి కృష్ణవేణి పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ వినతుల స్వీకరణ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణితో కలిసి ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసిన అనంతరం పరిష్కారం చూపాలని తెలిపారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కారం కావాలని తేల్చి చెప్పారు. ఈ విధమైన చర్యలతో అర్జీలు పెండింగ్ ఉండవని, నాణ్యతా లోపంతో అర్జీలు రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. దిగువ స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లి పరిష్కరించాలన్నదే ప్రభుత్వ



ధ్యేయమని, ఆ దిశగా అధికారులు నడుచుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అర్జీకి ఎండార్స్ ఇవ్వాలని, ఇచ్చిన అర్జీలపై జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 133 ఫిర్యాదులు పరిష్కారవేదికకు అందాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల మానవత్వం చాటుకున్న కలెక్టర్

వికలాంగుల పట్ల కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విచ్చేసిన వికలాంగుల సమస్యలను అడిగి తెలుసుకొని, అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో సీతానగరం మండలం చినబోగిల నుంచి చుక్క సత్యనారాయణ కలెక్టరుకు అర్జీని అందజేస్తూ, తనకు చేతి కర్రలు ఇప్పించాలని కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందిస్తూ చేతికర్రలను పంపిణీ చేశారు. అలాగే సాలూరులోని బంగారమ్మ కాలనీకి చెందిన చలమల రజనీ శతశాతం వికలాంగురాలు అయినందున ప్రస్తుతం మంజూరు చేస్తున్న రూ. 6వేల పింఛనును రూ.15వేలకు పెంపుదల చేయాలని ఆమె తల్లి సిహెచ్.గౌరీ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తదుపరి చర్యలు చేపట్టాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు.

తక్షణమే పిఆర్‌సి ప్రకటించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులందరికీ కూటమి ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి వేసి వేతనాలు పెంచాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మన్యం జిల్లా మున్సిపల్ యూనియన్ కోశాధికారి, పాలకొండ పట్టణ కార్యదర్శి సిహెచ్ సంజీవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్వై నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు మాట్లాడారు. ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, 17 రోజులు సమ్మె కాలానికి చేసుకున్న ఒప్పందాల్లో మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ మొత్తం పెంచడం, రిటైర్ వయస్సు 62ఏళ్లకు పెంపు వంటి నిర్ణయాలకు జీవోలు ఇవ్వాలని, పెరిగిన పట్టణాల జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచాలని, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి జీవో నెంబర్ 25 ప్రకారం నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 20, 21, 22, విజయవాడలో దీక్షలు 23న మహా ధర్నా నిర్వహిస్తున్నామని, కార్మిక వర్గం పాల్గొన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ భవిష్యత్తులో పోరాటానికి వెళ్తామని, ఇందు కోసం ఈనెల 13, 14న పాలకొండ పట్టణంలో 11వ మన్యం జిల్లా సిఐటియు మహాసభలు జరుగుతున్నాయని, కార్మిక వర్గమంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పాలకొండ పట్టణ నాయకులు శ్రీదేవి, విమల, రఘు, హరిబాబు పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు ఎన్వై నాయుడు, రమణరావు



గరికిపాటి రాజారావుకు నివాళ్లు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు

గరికిపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. పట్టణ నాయకులు బోనెల పరుశురాం ఆధ్వర్యంలో జరిగింది. తొలుత ప్రజాసంఘాల నాయకులంతా రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసం, ప్రగతి కోసమని చాటి చెప్పిన మహనీయుడు, ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు అని కొనియాడారు. డాక్టర్ వృత్తిని కొనసాగిస్తూ అనేకమంది కళాకారులను తయారు చేసి ప్రజానాట్యమండలిని రాష్ట్ర, దేశవ్యాప్తంగా విస్తరింప చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రజలను కళారూపాల ద్వారా చైతన్యవంతం చేస్తూ శాస్త్రీయమైన ఆలోచనలను పెంపొందిస్తూ సామాజిక చైతన్యం కలిగిస్తూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అనేక కళారూపాలను తయారు చేసి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప తాత్వికుడు గరికపాటి రాజారావుని కొనియాడారు. ఆ మహనీయుడు స్థాపించిన ప్రజానాట్య మండలిలో మనమంతా కలిసి పనిచేయాలని, అందులో మేమంతా పనిచేయడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. కళాతపస్వి ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను కళారూపాల ద్వారా ముందుకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయడమే మన ముందు కర్తవమని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వానేత ఆర్ శ్రీదేవి, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఉమా మహేశ్వరరావు, బి.సూరిబాబు, ప్రజానాట్య మండలి నాయకులు ఎం.రవి పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలివ్వాలి

ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

పాచిపెంట మండలం మైసూరుకు చెందిన వరలక్ష్మీ మహిళా పొదుపు సంఘానికి అవసరమగు బ్యాంకు రుణం ఇవ్వాలని ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరలక్ష్మి మహిళా పొదుపు సంఘం గత నాలుగు సార్లు బ్యాంకు నుంచి తీసుకున్న రుణ మొత్తాన్ని వడ్డీతో సహా గ్రూప్ సభ్యులంతా క్రమం తప్పకుండా బ్యాంకుకు చెల్లించారని, ఐదో విడత రుణం కొరకు దరఖాస్తు చేసుకోగా ఎపిఎం, సిసిపై గిరిజన శాఖ మంత్రి అనుచరులు, టిడిపి నాయకులు కలుగజేసుకొని రుణం మంజూరు చేయకుండా అడ్డుపడడం అన్యాయమని మండిపడ్డారు. రుణం తీసుకోవడం, చెల్లించడం మహిళా పొదుపు సంఘాల హక్కని, దీనిలో రాజకీయ జోక్యం తగదని హెచ్చరించారు. ఇకనైనా సంబంధిత అధికారులు కలుగజేసుకొని వరలక్ష్మి మహిళా పొదుపు సంఘానికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని, పొదుపు సంఘాలపై రాజకీయ వేధింపులు ఆపాలని, వాటికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో జిల్లావ్యాప్తంగా డ్వాక్రా సంఘాలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కురుపాంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఏకధాటిగా గంటపాటు భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులు క్రితం రెండు రోజులు తుఫాను పెట్టినప్పటికీ మళ్లీ ఎండల వేడి వేసవిని తలపించేలా ఉండడంతో తట్టుకోలేక ప్రజలు ఉక్కురిబిక్కిరవుతుండగా వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. మరోవైపు ఇప్పటికే ఉడిసిన ఉబాలకు, ఆరుతడి పంటలకు ఎంతగానో ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిఐగా ప్రసాదరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- పాలకొండ

స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆమిటి ప్రసాదరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం డిటిసి సిఐగా విధులు నిర్వహించిన ప్రసాదరావు బదిలీపై పాలకొండ సిఐగా వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎవరైనా గంజాయి, నాటుసారా క్రయ విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బంది సిఐకు శుభాకాంక్షలు తెలిపారు.

మాతృ మరణాలు సంభవించరాదు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, మాతృ మరణాలు సంభవించకుండా కార్యాచరణ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. ఉప జిల్లా స్థాయి ఎండిఆర్ కమిటీ సమావేశం జిల్లా ఆరోగ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గత నెలలో సంభవించిన గర్భిణీ మృతిపై సమీక్ష జరిపారు. గర్భిణీ నమోదు నుండి వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు సకాలంలో నిర్వహించారా, పర్య వేక్షణ, ఏ ఆరోగ్య సమస్య కారణంగా రిఫర్ చేశారు? వివరాలపై సంబంధిత అన్నవరం పిహెచ్‌సి వైద్యా ధికారి, సిబ్బందిని ఆరా తీశారు. రిఫరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ గర్భినికి ఆ సమయంలో నమోదు అయిన ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సా వివరాలపై వివరించారు. గర్భిణీ మృతికి గల కారణాలపై కమిటీ విశ్లేషించింది. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భిణీ ఆరోగ్య రీత్యా వైద్యారోగ్యశాఖ నిర్దేశించిన ప్రతి కార్యక్ర మాన్ని పక్కాగా అమలు చేయాలని, గర్భిణీ ఆరోగ్య విషయమై వైద్య సిబ్బంది జాప్యం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు, డిఐఒ డాక్టర్ విజయమోహన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్మోహన్, డాక్టర్ కౌశిక్, బ్లడ్ బ్యాంక్ నోడల్ అధికారి డాక్టర్ రాజ్, ఎఫ్ఒజిఎస్ఐ డాక్టర్ పద్మజ, డిపిహెచ్ఎన్ఒ ఉషా రాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'వివక్ష చూపుతున్న డిఇఒ మాకొద్దు'

ప్రజాశక్తి- పార్వతీపురం

మన్యం జిల్లాకు రెగ్యులర్ డిఇఒను వారం రోజుల్లో నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, ట్రైబల్ రైట్స్ ఫోరం, గిరిజన అభ్యుదయ సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో డిఆర్ఒ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, ఇంటికొప్పల రామకృష్ణ, ఆరిక చంద్ర శేఖర్, శంకర్రావు, దుక్క సీతారాం, రొబ్బ లోవరాజు, చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజులు మాట్లాడుతూ ఇన్‌ఛార్జ్ డిఇఒ రాజ్ కుమార్ గిరిజన ఉపాధ్యాయులను, గిరిజన విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని వివరించారు. వరుసగా పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లా కు రెగ్యులర్ డిఇఒను నియమించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో రెగ్యులర్ డిఇఒను నియమించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, కార్మికుల సమస్యల పరిష్కరించాలని కార్మికుల, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, ఆర్.రాము, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, గత వైసిపి హయాంలో ఇసుక క్వారీలు ఆపివేసి కార్మికులకు పనులు లేకుండా అన్యాయం చేశారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా గతంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందన్నారు. ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేయిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను విశ్వసించి ఓట్లు వేశారని, ఫలితంగానే కూటమి ప్రభుత్వం అధికారం ఏర్పడిందని అన్నారు. కావున ఇకనైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించాలని, గతంలో శాంక్షన్ చేసి పెండింగులో ఉంచిన క్లైములకు వెంటనే నిధులు చెల్లించాలని, 1234 మెమోను రద్దు చేసి కార్మికులకు సంక్షేను పథకాలు అమలు చేయాలని, కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్‌లను


నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

రద్దుచేయాలని, కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ విధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చెయ్యాలని, అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగడం భాష, రాంబాబు, రాపాక శ్రీను, ముక్కు చంద్రరావు, గెంబలి హరి, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

స్థానిక ఎఎంసి వద్ద గల పశువుల సంతలో ప్రతి లక్ష్మీవారం లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా మౌలిక సదుపాయాలు మాత్రం లేవని సిపిఎం పట్టణ కమిటీ విమర్శించింది. ఈ మేరకు సోమవారం డిఆర్ఒ కె.హేమలతకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మార్కెట్ యార్డు సంతలో ప్రతి గురువారం పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల ఇలా అనేక రకాల వస్తు వ్యాపారాలు లక్షల్లో జరుగుతుందని, అదే రీతిలో పన్నులు కూడా మార్కెట్ యార్డ్ సిబ్బంది వసూలు చేస్తున్నారన్నారు. అయితే సంతో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గిరిజనులకు, దళితులకు, వ్యాపారులకు తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నారా అని ప్రశ్నించారు. వర్షాలు పడితే పూర్తిగా సంతలోపలికి వెళ్లలేని పరిస్థితి ఉందని, దీనివల్ల వ్యాపారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కావున జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి అధిక మోతాదులో పన్నులు వసూలు చేస్తున్న మార్కెట్ యార్డ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, మార్కెట్ యార్డ్ రోడ్లు శుభ్రం చేసి కొత్త రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చేవారం సంతలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమా, పి.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకులుగా పనిచేస్తున్న మజ్జి గోవిందరావు అవార్డు గ్రహీత ప్రిన్సిపాల్ డిజి ఎస్వీ త్రినాథ్, అధ్యాపక సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవ భాగంగా ఉత్తమ అధ్యాపకులుగా గుర్తింపు లభించడంతో సన్మానించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

చాకలిబండి కార్యక్రమాన్ని నిషేధించాలి

పాలకొండ: దసరా, వినాయక చవితి ఊరేగింపుల్లో చాకలి బండి కార్యక్రమాన్ని నిషేధించాలని రజక సంఘ నాయకులు గార దుర్గారావు, జగదీష్ తదితరులు సోమవారం సబ్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఎ.సావిత్రికి వినతిపత్రం అందించారు. ఊరేగింపుల్లో చాకలి బండి కార్యక్రమం నిర్వహించి తమను కించపర్చేలా నాటకాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నట్లు తమకు అవమానాన్ని గురి చేస్తున్నారన్నారు. దీని వెంటనే నిషేధించాలని కోరారు.

వైసిపి కార్యకర్త మృతి

పరామర్శించిన మాజీ డిప్యూటీ సిఎం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం పంచాయతీ సర్పంచ్ తాడంగి తులసమ్మ భర్త, వైసిపి కార్యకర్త మిన్నారావు సోమవారం మృతి చెందారు. మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి మతిని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వైసిపి నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వీరాభిమాని మిన్నారావు అకాల మరణం చెందడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి రాధిక, ఎంపిటిసిలు, సర్పంచులు ఉన్నారు.

ఆశీల వేలం వాయిదా

మక్కువ: మక్కువ మేజర్ పంచాయతీలో మక్కువ మార్కెట్, ఇతర దుకాణాలపై రోజువారి ఆశీలకు గాను సోమవారం జరగాల్సిన వేలంపాట అనివార్యకారణాలు వాయిదా వేశారు. పాటలో పాల్గొనేందుకు ముగ్గురు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ. స్థానిక ఇఒ బి.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ అనారోగ్య కారణాల రీత్యా హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు సచివాలయం 2 కార్యదర్శి విశాల్ తెలిపారు. మరలా ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఉద్యోగుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలి

పార్వతీపురం: ఏపి స్వస్థాంధ్ర కార్పొరేషన్ ద్వారా భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఎస్‌ఎల్‌టిఎం శిక్షకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లలో స్వస్థాంధ్ర కార్పొరేషన్ జిల్లా సొసైటీ, జట్టు ఆశ్రమం ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో తాము శిక్షణ పొందామని, ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏజెన్సీ ద్వారా ఈ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిసిందని, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక చింతలగూడ ఎయిడెడ్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఫైలేరియా పరీక్షలను నిర్వహించారు. 15 మంది విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ భారతి, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.రత్న ప్రసాద్, జె. అజయ్, ఎల్.టి ఎం.కేశవరావు, హెచ్ఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం అందించాలని వినతి

పార్వతీపురం: 11 నెలలుగా ముస్లిం ఇమామ్‌లు, మౌజాన్‌లకు గౌరవ వేతనం అందడం లేదని వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు అఫీజ్ ఖాన్ ఆధ్వర్యాన ముస్లిలు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. గత ప్రభుత్వం హయాంలో నెలనెలా గౌరవ వేతనం అందేదని, ఇప్పుడు 11నెలలుగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ మహమ్మద్ నజీర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్, మండల, జిల్లా కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

227 మందికి నేత్ర వైద్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామ జంక్షన్ వద్ద గల శిరిడి సాయి బాబా ధ్యాన మందిరంలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యాధికారులు నికిత, రత్నం రాజులు 227 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. 133 మందికి కళ్ళద్దాలు పంపిణీ చేశారు. అంతకుముందు హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిజిఎం వి.రమేష్, క్యాంపు మేనేజర్ ఎన్ అప్పలరాజు, క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, ఆలయ నిర్వాహకులు ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నీటిని వేడి చేసి తాగాలి

సాలూరు రూరల్: మంచినీటిని వేడి చేసుకొని తాగాలని మున్సిపల్ కమిషనర్ టిటి.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాలూరు పురపాలక సంఘం వద్ద హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో వేగావతి నది నుంచి ఎక్కువగా బురద నీరు వస్తుందని దీని వల్ల హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర గల ఇన్ఫిల్ట్రేషన్(ఊట బావులలో) వెల్స్ నందు బురద నీరు చేరిపోతుందన్నారు. వాటర్ సప్లై సిబ్బంది, అధికారులు బురద నీటిని తగ్గించడానికి అన్ని రిజర్వాయర్లలో ఆలం కలుపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు హెడ్ వాటర్ వర్క్ నుంచి వచ్చు నీటిని వడపోసి, కాచి చల్లార్చిన తరువాతనే తాగాలన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టిన గిరిజనులు

కురుపాం: మండలంలోని తిత్తిరి పంచాయతీలో గల ఎగువ గుండం, దిగువ గుండం గిరిజన గ్రామాలకు ఉన్న రహదారి ఇటీవల పడిన వర్షాలకు పూర్తిగా పాడైపోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి, అత్యవసర సమయంలో ఆరోగ్యం బాగు లేనప్పుడు ఆటోతో తీసుకెళ్లడానికి కూడా ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఆ గ్రామాల గిరిజన ప్రజలు స్వచ్ఛందంగా కొంత నిధులను ఎత్తుకొని ట్రాక్టర్‌తో గ్రావెల్ వేసి శ్రమదానంతో సోమవారం రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజలు మాట్లాడుతూ ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బిటి రహదారి మంజూరు చేసేలా చర్యలు చేపట్టి, ప్రయాణ మార్గం సులభతరం చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై సమావేశం నిర్వహించాలి

వీరఘట్టం: విద్యా రంగ సమస్యలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమావేశం నిర్వహించాలని ఎపి ఎస్సీ, ఎస్టీ టిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి సత్యనారాయణ రెడ్డి, అన్ను వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపింఛన్ అమలు చేయాలని, ప్రభుత్వం పిఆర్‌సి ప్రకటించాలని, బకాయి ఉన్న డిఎలను, సరెండర్ లీవులు తక్షణమే చెల్లించి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో డీఎస్సీ 2025 అభ్యర్థులు నియమించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఏపీ ఎస్సీ ఎస్టీ టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరావును స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధానోపాధ్యాయులు బి సోంబర, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఆస్పత్రి పరిశీలన

ప్రజాశక్తి- సీతానగరం

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ రఘు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరికి ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ ప్రజాశక్తి విలేకరి శివప్రసాద్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకొని సోమవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు, మాజీ కమిషనర్ లిల్లీ పుష్పనాదం, కౌన్సిలర్లు కాంతా రావు కిల్లారి మోహన్, కె.విజయకుమార్, వైస్ ఎంపిపి కె. సూర్యప్రకాష్, అంపిలి సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు ఉన్నారు.


శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పిజిఆర్ఎస్‌కు 41 అర్జీలు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. దీనికి చుట్టుపక్కల మండలాల నుండి 41 వినతలు వచ్చాయి. భామిని మండలం పోలవరానికి చెందిన బి.కన్నయ్య ఎరువులు ఇప్పించాలని కోరారు. చీడిమానుగూడకు చెందిన సవర విజయకుమార్ సిసి రోడ్డు మంజూరు చేయాలని, సింగమ్మవలసకు చెందిన తులసయ్య చేప పిల్లలు సరఫరా చేయాలని, చినబగ్గకాలనీ సుభాషిని వ్యవసాయ కాలువ మరమ్మతులు చేపట్టాలని, లాడకు చెందిన హారికప్రసాదు రచ్చబండ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇంజనీరింగ్ పనులు నాణ్యతగా చేయాలన్నారు ఈ ఆఫీస్‌లోనే ఈ ఫైల్స్ అప్లోడ్ చేయాలన్నారు. 15న ఐటిడిఎలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి హాజరయ్యేలా ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ఎపిడి సన్యాసిరావు, పిహెచ్ఒ వెంకట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు: ఎస్‌పి

పార్వతీపురంటౌన్: ఫిర్యాదుదారుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి, సమస్యలను వివరించి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఎస్‌వి. మాధవరెడ్డి అన్నారు. ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా ఎస్‌పికి వివరించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలలో వాస్తవాలు ఉన్నట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పిఒ

అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసి ప్రాంతాల్లో అక్షరాస్యత అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ జె.ఉమా మహేశ్వరి అన్నారు. సోమవారం మండలంలో బియ్యాలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద యస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని వారికి స్థానిక గ్రామాల ప్రజలు సహకరించి పిల్లలు విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం 43 మంది విద్యార్థులకు యస్ సొసైటీ అందించిన పెన్నులు, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌లను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వై.వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.వేణు గోపాల్, ఉపాధ్యాయులు మజ్జి ఉపేంద్ర, కృష్ణారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా 'మావుడి'

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావుకు వైసిపి పార్లమెంట్ స్థాయి రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర కార్యదర్శితో పాటు పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించారు. నియోజకవర్గాల పరిశీలనతో పాటు సమన్వయకర్తలను కూడా కలుపుకొని ఎప్పటికప్పుడు పార్టీకి దిశ నిర్దేశం చేయాలని అందులో పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మహన్ రెడ్డికి, మాజీ డిప్యూటీ సిఎం, పీడికి రాజన్నదొరకు శ్రీనువాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపితోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి- పాచిపెంట

టిడిపితోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని గిరిజన శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని రాయిగుడ్డి వలస పంచాయతీ కొండ తాడూరు గిరిజన గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సుమారు 300 మంది మండల టిడిపి అధ్యక్షుడు గూడెపు యుగంధర్ ఆధ్వర్యంలో సోమవారం టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి మంత్రి సంధ్యారాణి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి తమకు అత్యంత ప్రాధాన్యమని, గ్రామాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని అన్నారు. స్థానిక ఎన్నికల్లో టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. తనపై నమ్మకంతో పార్టీలో చేరిన కొండ తాడూరు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యంగా గ్రామానికి పక్క రహదారి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలు లేకుండా గిరిజన గ్రామాలు అన్నిటికీ రోడ్లు వేస్తామని, ఇప్పటికే నియోజవర్గంలో 200 కోట్లతో రోడ్లు నిర్మించామని రాష్ట్రంలో 1300 కోట్లతో ఐటిడిఎ ద్వారా రోడ్లు కాలువలు వేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ సర్పంచ్ జన్ని లక్ష్మణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, చల్ల కనక బాబు, కే సురేష్, మతల బలరాం, కొత్తల పోలినాయుడు, మాదిరెడ్డి మజ్జరావు, పల్లెడ ఉమామహేశ్వరరావు, దోనేరు ఆనంద్, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ధర్నాను జయప్రదం చేయాలి : వైసిపి

సీతానగరం : పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఈ నెల 9న జరుగు ధర్నాను జయప్రదం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములనాయుడు కోరారు. స్థానిక వైసిపి నాయకులు ధర్నా పోస్టులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. యూరియా కొరతలేదని అధికారులు చెప్తున్నా, వారి చేతుల్లో ఏమీ లేదన్నారు. అధికార పార్టీ నాయకులకు మాత్రమే యూరియా పుష్కలంగా ఉందన్నారు. ప్రభుత్వ తీరునకు నిరసనగా మంగళవారం జరగనున్న ధర్నాకు రైతులు పెద్దఎత్తున రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు బంకురు శంకర్రావు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, గాదిలవలస సర్పంచ్ బొన్నాడ సావిత్రి, తిరుపతిరావు, బి.ముకుందరావు, ఎం.వెంకటరమణ, శంకర వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా 11వ మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ మహాసభలు సందర్భంగా సెప్టెంబర్ 13న 10 గంటలకు దుర్గ గుడి సెంటర్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు సిఐటియు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కావున ఉద్యోగులు, కార్మికులు, అంగన్వాడీ, ఆశ, ఎండిఎం వంట కార్మికులు, స్కీ వర్కర్స్, శ్రామిక మహిళలు, అసంఘటిత రంగ కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.అమరవేణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సిహెచ్.సంజీవి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాదా రాము, అర్తమూడి లక్ష్మణరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ పాలకొండ అధ్యక్షులు గేదెల సత్యం, భవనం నిర్మాణ కార్మిక సంఘం పాలకొండ మండల కోశాధికారి మల్లవరపు రమేష్, ప్రజా సంఘాల నాయకులు జి జెస్సీబాయ్, ఎం.శ్రీదేవి, చింతల రఘు, దూసి దుర్గారావు, ఎ.భాను సుందరం తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జీవన ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి- పాచిపెంట

రైతులు విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడినట్లయితే నేల స్వభావం దెబ్బతినడమే కాకుండా పర్యావరణం కాలుష్యం అవుతుందని, నీటి కాలుష్యం ఎక్కువ అవ్వటం వల్ల మనుషులు పశువులు, అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పాంచాలి, రాయి గుడ్డి వలస రైతు సేవా కేంద్రాల వద్ద రైతులతో ఆయన సోమవారం మాట్లాడారు. తక్కువ ఖర్చుతో భూమిలో ఉన్న ఎరువులను మొక్కకు అందించే విధంగా జీవన ఎరువులను వినియోగించుకున్నట్లయితే ఈ జీవన ఎరువులు భూమిలో కరగని స్థితిలో ఉన్న పోషకాలను కరిగించి మొక్కకు అందిస్తాయన్నారు. పొటాష్, భాస్వరం, షాలిబు లైజింగ్ బ్యాక్టీరియా ఒక లీటరు 10 కేజీల పశువుల గెత్తం కలిపి చల్లుకుంటే భూమిలో ఉన్న భాస్వరం పొటాషులను పంటకు అందిస్తాయన్నారు. విఎఎలు మహమ్మద్ నూరాని, మోహనకృష్ణ, సాయి గణేష్, రైతులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, కొబ్బరి నూనె, మాస్కులు, యూనిఫామ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం గ్రీన్ అంబాసిడర్లతో కలిసి నిరసన తెలిపి ఎంపిడిఒ రమేష్‌కి వినతిపత్రం అందజేశారు. సాంబమూర్తి గ్రీన్ అంబాసిడర్ల మండల నాయకులు కొండగొర్రి చంటి, రాఘవ మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుకు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పట్ల ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వమే నేరుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే మండలంలో ఉన్న కార్మికులను ఐక్యం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

డి పట్టాలకు భూములు చూపించాలి

ప్రభుత్వం మంజూరు చేసిన డి పట్టాల భూములకు వెంటనే సర్వే చేసి లబ్ధిదారులకు భూమిని అప్పజెప్పాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలిసి నిరసన చేపట్టి తహశీల్దార్ సత్యనారాయణకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్పందిస్తూ భూమిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని కొట్టు గ్రామానికి చెందిన దళితులు, బీసీ కులానికి చెందిన సుమారు 32 మంది పేదవారికి గతంలో కెమిశీల రెవెన్యూ పరిధిలో డి పట్టా భూములు మంజూరు చేసి పట్టాలు ఇచ్చినప్పటికీ ఆ భూమిని పేదలకు అప్పజెప్పకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చేతకానితనం వల్లే యూరియా కొరత

ప్రజాశక్తి- పాచిపెంట

ప్రభుత్వం చేతకానితనం వల్ల ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యూరియా కొరత ఏర్పడిందని వైసిపి మండల నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో ఎంపిపి బి.ప్రమీల నివాసంలో సోమవారం 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతు అయితే ఆ రైతు వెన్నెముక కూటం ప్రభుత్వం విరిచేసిందన్నారు. ఈ నెల 9న చేపట్టనున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, ఎంపిపి బి.ప్రమీల, ఎంపిటిసి దండి ఏడుకొండలు, మోదుగ సర్పంచ్ సింహాచలం, మండల యువజన విభాగం నాయకులు దండి కొండలరావు, కుసుకు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నిరసన వారం' విజయవంతం చేయండి

ఎపిటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - వీరఘట్టం

నిరసన వారం విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నడిమికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన వారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మండలి మురళి మాట్లాడుతూ సిపిఎస్‌పై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మేనిఫెస్టో ప్రకటించిన చంద్రబాబు నేటికీ ఆ ఊసు ఎత్తడం లేదన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్‌సి వారికి అదే తరహా ఇతర శాఖలను ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు జరిగి తీరాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతామని 12న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 13,14న ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు, 15న పాత తాలూకు కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 16న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన, 17న సీఎం సిఎస్‌లకు వాట్సాప్ ఈమెయిల్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నరహరిరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.ధనుంజయ నాయుడు, బి.రామారావు, బిఎం గౌరీశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.హరినారాయణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొమరాడ: మండలంలోని కోటిపాం గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సోమవారం సమాచారం అందజేశారు. ఈ మేరకు రైల్వే జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ రత్నాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ట్రైన్ నుంచి జారిపడి హృతి చెంది ఉండవచ్చునని, లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని చెప్పారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు.

ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండల పరిధిలోని సరాయివలస, వెంకంపేట, కవిరిపల్లి, కోన, డి.సిర్లాం రైతు సేవా కేంద్రాలలో సోమవారం నుండి యూరియా పంపిణీ చేస్తున్నామని ఎఒ సిహెచ్ భారతి తెలిపారు. మండలానికి కావలసిన మొత్తం ఎరువులో సుమారు 80శాతం వరకు యూరియాను ఇది వరకే తెప్పించామన్నారు. ఎవరికైతే గతంలో యూరియా అందలేదో అటువంటి రైతులకు ముందు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శంబర, కాశీపట్నం, తురుమామిడి, వెంకట భైరిపురం, మార్కొండపుట్టి ఆర్ఎస్ కేంద్రాలకు తరువాత విడతలో సుమారు వారం రోజులలో ఎరువులు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆమె కోరారు.

15 అడుగుల కింగ్ కోబ్రా పట్టివేత

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో తూరాయిపువలసలో ఉన్న కోట దుర్గ నర్సరీలో కింగ్ కోబ్రా మెదలడంతో యజమాని భుజంగరం ఫారెస్ట్ రేంజర్‌కి ఫిర్యాదు చేశారు. స్పందించి ఫారెస్ట్ బీట్ అధికారి దారి నాయుడు ఆధ్వర్యంలో స్నేక్స్ క్యాచర్స్‌ను తెప్పించి 15 అడుగుల అరుదైన కింగ్ కోబ్రాను పట్టుకున్నారు. అనంతరం సీతంపేట అడవుల్లో వదిలేశారు. ఈ కింగ్‌కోబ్రాను ప్రజలు తండోప తండోలుగా వచ్చి వీక్షించారు.